ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
గురువారం 28 నవంబరు 2024



ఇతర పంటలపై ప్రభావం...

జిల్లాలో 30 నుంచి 40 వేల ఎకరాల్లో పత్తి సాగవుతోంది. ప్రస్తుతం పంట ఏరివేతకు సిద్ధంగా ఉంది. అయితే కూలీల కొరత కారణంగా పత్తి సేకరణ సాధ్యం కావడం లేదు. సకాలంలో ఏరకపోతే.. తుఫాన్ ప్రభావం పత్తి పంటపై పడే అవకాశం కనిపిస్తుంది. ఇదిలా ఉండగా వరికోతలు కోసే ముందు రబీ పంట కింద అపరాలు మినుము, పెసర, కట్టె జనుం విత్తనాలను రైతులు పంట పొలాల్లో జల్లుతున్నారు. అయితే వర్షాలు అధికంగా కురిస్తే ఇప్పుడిప్పుడే మొలకెత్తుతున్న రబీ పంటలపైనా ఆ ప్రభావం పడనుంది.

ఫెంగల్..టెన్షన్!

- రైతులను వెంటాడుతున్న తుఫాన్ భయం
- వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో తీవ్ర ఆందోళన
- పంటను కాపాడుకునేందుకు ఆపసోపాలు



కల్లాల్లో ధాన్యాన్ని బస్తాలకెక్కిస్తున్న రైతులు


పాలకొండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా రైతులను ఫెంగల్ తుఫాన్ భయం వెంటాడుతోంది. రానున్న రెండు రోజుల్లో భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉందన్న సమాచా రంతో వారిలో గుబులు రేగుతోంది. ఆరుగాలం కష్టపడి పండించిన వరి కోత దశకు వచ్చింది. కొన్నిచోట్ల పొలాల్లోనే పంట ఉండగా.. ఈ తరుణంలో వర్షాలు కురిస్తే పూర్తిగా నష్టం వాటిల్లే అవకాశముంది. ధాన్యం తడిసి రంగు మారి, తేమ పెరిగితే కొనుగోలు కేంద్రాలకు విక్రయించలేమని రైతులు ఆందోళన చెందుతున్నారు. మొత్తంగా వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ధాన్యాన్ని భద్రపరిచేందుకు ఆపసోపాలు పడుతున్నారు.

ఇదీ పరిస్థితి..

- ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులు జిల్లాలో సుమారు రెండు లక్షల ఎకరాల్లో వరిసాగు చేపట్టారు. ప్రస్తుతం పలుచోట్ల కోతలు పూర్తయ్యాయి. మరికొన్నిచోట్ల ఆ పనులు జరుగుతున్నాయి. అయితే ఫెంగల్ తుఫాన్ నేపథ్యంలో జిల్లాలో ఈ నెల 29, 30 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ ప్రకటించింది. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పంటను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు.
- వాస్తవంగా ఖరీఫ్ సీజన్ మొదలైనప్పటి నుంచి రైతులకు కష్టాలు తప్పలేదు. ఒకవైపు తీవ్ర వర్షాభావం.. మరోవైపు సాగునీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సాగునీటి ప్రాజెక్టుల నుంచి శివారు ప్రాంతాలకు నీరు అందకపోయినా.. నానా అవస్థలు పడి చివరి దశలో ఉన్న పంటను దక్కించుకున్నారు.
- కూలీల కొరత కారణంగా సకాలంలో కోతలు పూర్తి చేయలేకపోయారు. ఇప్పటికీ పాలకొండ, సాలూరు, కురుపాం, పార్వతీపురం నియోజకవర్గాల్లో 50 శాతానికి పైగా వరి పంట పొలాల్లోనే ఉంది. కొంతమంది రైతులు కోతలకు సిద్ధపడుతుండగా, మరికొంతమంది కల్లాలకు ధాన్యం తరలించేందుకు సన్నద్ధమవుతున్నారు.
- జిల్లాలో ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో ధాన్యం కొనుగోలు జరగలేదు. ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినప్పటికీ జిల్లా యంత్రాంగం ఇప్పుడిప్పుడే ఆయా మండలాలకు టార్గెట్లు విధించారు. అయితే క్షేత్రస్థాయిలో ఇంకా కొనుగోలు జరగడం లేదు. దీంతో పొలాలు, కల్లాల్లోనే ధాన్యం బస్తాలు దర్శనమిస్తున్నాయి. తుఫాన్ కారణంగా వర్షాలు కురిస్తే పంటను పూర్తిగా నష్టపోనున్నామనే ఆందోళనతో రైతులు ఎంతోకొంత ధరకు ధాన్యం విక్రయిస్తున్నారు. మొత్తంగా వాతావరణ ప్రతికూల పరిస్థితుల్లో పంటను కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు.



పొలాల్లోనే ఉన్న వరి ఓవులు





ఏరేందుకు సిద్ధంగా ఉన్న పత్తి పంట

అప్రమత్తం చేస్తున్న వ్యవసాయశాఖ

ఫెంగల్ తుఫాన్ నేపథ్యంలో జిల్లా వ్యవసాయాధికారులు రైతులను అప్రమత్తం చేస్తున్నారు. పొలాల్లో ఉన్న వరి పనల కుప్పలపై టార్పాలిన్లు కప్పాలని.. నూర్పులు జరిపిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, కల్లాల్లో ధాన్యం ఉంటే.. వెంటనే బస్తాలతో నింపుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్ సూచిస్తున్నారు. కాగా పంటంతా పొలాల్లోనే ఉందని, కూలీల కొరతతో పనులు ముందుకు సాగడం లేదని రైతులు వాపోతున్నారు.

ప్రతి ధాన్యం గింజా

కొనుగోలు చేస్తాం

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

సీతానగరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. బుధవారం అంటిపేటలో పర్యటించారు. అక్కడున్న రైతులతో మాట్లాడి.. ధాన్యం కొనుగోలుపై ఆరా తీశారు. దళారుల మాటలు విని మోసపోవద్దని, రైతులకు అవసరమైన గోనె సంచులు, రవాణా, హమాలీల సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందని ఆయన తెలిపారు. ధాన్యం విక్రయించిన 48 గంటల్లోనే అన్నదాతల ఖాతాల్లో నగదు జమవుతుందన్నారు. రైతులు ఇచ్చిన కొలతల మేరకే మిల్లర్లు సరుకు తీసుకోవాలని సూచించారు. అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. తుఫాన్ నేపథ్యంలో సురక్షిత ప్రాంతాలకు పంటను తరలించాలన్నారు. ఈ పర్యటనలో జేసీ శోభిక , జిల్లా వ్యవసాయ శాఖాధికారి రాబర్ట్‌పాల్, సివిల్ సప్లైస్ డీఎం పి.శ్రీనివాసరావు, తహసీల్దార్ ఉమామహేశ్వరరావు తదితరులు ఉన్నారు.

సర్వే ప్రారంభం కావాలి

పార్వతీపురం/టౌన్: జిల్లాలో ఈ నెల ఈనెల 29వ తేదీ నుంచి సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమల సర్వే ప్రారంభం కావాలని కలెక్టర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎంపీడీవోలతో మాట్లాడుతూ.. మున్సిపల్, మండలాల పరిధిలో జరిగే ఈ సర్వేకు కమిషనర్లు, ఎంపీడీవోలు, జిల్లా స్థాయిలో జిల్లా పరిశ్రమల కేంద్రం డీఎం నోడల్ అధికారులుగా ఉంటారని ఉంటారన్నారు. యాప్ ద్వారా వివరాలు సేకరించేందుకు వార్డు, గ్రామ సచివాలయాల నుంచి ఆరుగురు సిబ్బందిని తీసుకోవాలని సూచించారు. పోర్టల్‌లోనూ సమచారం అప్‌లోడ్ చేయాలన్నారు. యాప్ వినియో గంపై గురు, శుక్రవారాల్లో సిబ్బందికి శిక్షణ ఇచ్చి సర్వేను ప్రారంభించాలన్నారు. సంక్రాంతిలోగా సర్వేను పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలను అందంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ సీడీపీవోలను ఆదేశించారు. కేంద్రాల్లో మౌలిక వసతుల కోసం నిధులు మంజూరు చేశామని, త్వరగా పనులు చేయించుకోవాలని సూచించారు. బాల్య వివాహాల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి ఎంఎన్ రాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ప్రభాకరరావు, తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

వితంతువులకు భరోసా

- తక్షణమే పింఛన్ మంజూరుకు ప్రభుత్వ నిర్ణయం
- తప్పనున్న కష్టాలు



పార్వతీపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వితంతువులకు భరోసా కల్పించేలా పింఛన్ విషయంలో ప్రభుత్వం కొత్త నిబంధన తీసుకొచ్చింది. భర్త మృతి చెందిన వెంటనే భార్యకు వితంతు పింఛను మంజూరు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. ఇంటికి పెద్దగా, కుటుంబ పోషణలో కీలకంగా వ్యవహరించే వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబ పరిస్థితి అగమ్యగోచరం. ఆ ఇంటి ఇల్లాలే మొత్తం కుటుంబ బాధ్యత మోయాల్సి ఉంటుంది. ఆమెకు వచ్చే వితంతు పింఛన్ సొమ్ము ఆ కుటుంబానికి ఎంతోకొంత ఆసరాగా ఉంటుంది. అయితే గత వైసీసీ ప్రభుత్వంలో వితంతువులకు పింఛన్ మంజూరు కావాలంటే సవాలక్ష నిబంధనలు ఉండేవి. వైసీపీ నాయకులు చెబితే గానీ వారికి పింఛను మంజూరయ్యేది కాదు. సచివాలయాలు, ఎంపీడీవోల కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. అన్ని ధ్రువపత్రాలు సమర్పించినా ఏదో ఒక క్వొరీ పెట్టేవారు. దీంతో నెలల తరబడి వితంతువులకు పింఛన్లు మంజూరయ్యేవి కావు. కూటమి ప్రభుత్వం వారి కష్టాలకు చెక్ పెట్టింది. పింఛను మంజూరు విషయంలో ఊరట కలిగించే విధంగా నిబంధన తీసుకొచ్చింది. భర్త ఒకటో తేదీ నుంచి 15వ తేదీలోపు మరణిస్తే భార్యకు వెంటనే వితంతు పింఛను మంజూరు చేయాలని నిర్ణయించింది. 15వ తేదీ నుంచి 30వ తేదీలోపు మరణిస్తే ఆ వ్యక్తి మరణ ధ్రువపత్రం, ఆధార్‌తో పాటు ఇతర పత్రాలు, సచివాయం ద్వారా ఎంపీడీవోకు పంపించాలి. వెంటనే వితంతు పింఛను మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతుంది.

ఆదివాసీ సంస్కృతికి అద్దం.. థింసా

- ఆకట్టుకునే గిరిజనుల నృత్యం
- దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు



6లో

పెళ్లైన నెల రోజులకే

అనంత లోకాలకు..

- స్టీల్‌ప్లాంటు మార్గంలో ఘెర రోడ్డు ప్రమాదం
- ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరు యువకులు మృతి
- మృతులు మేనమామ, మేనల్లుడు
- స్వస్థలం పాలకొండ



రూపేష్‌కుమార్, పవన్‌కుమార్(ఫైల్)

ఉక్కుటౌన్‌షిప్ (విశాఖ పట్నం)/పాలకొండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పెళ్లైయిన నెల రోజులకే ఆ యువకుడికి నిండు నూరేళ్లు నిండిపోయాయి. అతనితో పాటు మరొకరు స్టీల్‌ప్లాంటు ప్రధాన మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. వివరాలిలా ఉన్నాయి. పాలకొండ ఇంద్రానగర్‌కు చెందిన డబ్బీరు పవన్‌కుమార్ (30) పరవాడ ఫార్మా సిటీలో పనిచేస్తూ కూర్మన్నపాలెం సమీపంలోని శాతవాహన నగర్‌లో నివాసముంటున్నాడు. అతని మేనల్లుడు కొండవలన రూపేష్ కుమార్ (21) హైదరాబాద్‌లో సీఏ ఫైనలియర్ చదువుతున్నాడు. ఇద్దరూ బుధవారం రాత్రి బైక్‌పై స్టీల్‌ప్లాంటు ప్రధాన మార్గంలో కణితి వైపు వెళ్తుండగా వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. హైదరాబాద్‌లో చదువుకుంటున్న రూపేష్‌కుమార్ ఇక్కడకు ఎందుకు వచ్చాడో తెలియదని అతని తల్లి, పవన్‌కుమార్ అక్క సంఘటనా స్థలం వద్ద భోరున విలపించారు. పవన్‌కుమార్‌కు గత నెల 26న వివాహమైందని అతని అక్క తెలిపింది. మరికొద్దిరోజుల్లో భార్యను ఇక్కడకు తీసుకువచ్చేందుకు చూస్తున్న సమయంలో ఘోరం జరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేసింది. కాగా ట్రాఫిక్ పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఆర్టీసీ బస్సు డ్రైవర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు.

పేరుకుపోతున్నాయ్!

- రూ.కోట్లలో పన్ను బకాయిలు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల నుంచే భారీగా పెండింగ్
- మున్సిపాల్టీ, నగర పంచాయతీల్లో దారుణ పరిస్థితి
- వసూళ్లు అంతంతమాత్రమే..



- 109 రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.8.06 కోట్లు పన్నుల వసూళ్ల లక్ష్యం కాగా 85 కార్యా లయాల నుంచి కేవలం రూ.86 లక్షలు మాత్రమే వసూ లైంది. 24 కార్యాలయాల నుంచి రూ.7.20 కోట్లు రావల్సి ఉంది.
- జిల్లా కేంద్రాసుపత్రి నుంచి రూ.4.94 కోట్లు, జంఝావతి డివిజన్ కార్యాలయం నుంచి రూ.47.17 లక్షలు, పోలీసు శాఖ పాత, కొత్త నివాసాలు, కార్యాలయాలకు సంబంధించి రూ.35.12 లక్షలు, సబ్ కలెక్టరేట్ రూ.25.70 లక్షలు, పంచాయతీ రాజ్ కార్యాలయం రూ.18.33లక్షలు, తహసీల్దార్ కార్యాలయం రూ.16.47 లక్షలు చెల్లించాల్సి ఉంది.
- రైల్వే స్టేషన్లతో పాటు కాలనీల ఇంటి, కొళాయి పన్నుల బకాయిలు రూ.22.09 లక్షల వరకు ఉన్నాయి.

పార్వతీపురం టౌన్/సాలూరు/పాలకొండ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మున్సిపాల్టీలు, నగర పంచాయతీలకు పన్ను బకాయిలు గుదిబండగా మారాయి. ఇంటి, కొళాయి పన్నులు పూర్తిస్థాయిలో వసూలు కాకపోవడంతో అభివృద్ధి కుంటు పడుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన కార్యాలయాలు, కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు ఏళ్లు గడుస్తున్నా ఆస్తి పన్నులు చెల్లించడం లేదు. దీంతో రూ. కోట్లలో పన్ను బకాయిలు పేరుకుపోయాయి. ప్రస్తుతం మున్సిపల్, రెవెన్యూ అధికారులు వాటిపై దృష్టి సారించారు పన్ను వసూలుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. అయితే ఈ ఆర్థిక సంవత్సరంలో వసూలు లక్ష్యాన్ని చేరుకోగలరా? అన్నది ప్రశ్నార్థ కంగా మారింది. జిల్లాలోని పార్వతీపురం, సాలూరు, పాలకొండలో పరిస్థితిని పరిశీలిస్తే..

పాలకొండలో...



పాలకొండ నగర పంచాయతీ పరిధిలో రూ. కోటి 95 లక్షల వరకు పన్ను బకాయిలు ఉండగా, ఇప్పటి వరకు రూ.కోటి నాలుగు లక్షలు వసూలు చేశారు. ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.49.90 లక్షలకు గాను రూ.ఐదు లక్షలే వసూలైంది. కొళాయి పన్ను బకాయిలు రూ.64 లక్షల వరకు ఉండగా రూ. పది లక్షలు మాత్రమే వచ్చింది. 'పన్నుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం.' అని కమిషనర్ సర్వేశ్వరరావు తెలిపారు.

జిల్లాకేంద్రంలో..

- పార్వతీపురం మున్సిపాల్టీ పరిధిలో ఇంటి పన్నుల విషయానికొస్తే.. 13,395 అసెస్‌మెంట్లకు గాను రూ.6.04 కోట్లు వసూళ్ల లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే ఇప్పటివరకు రూ.2.38 కోట్లు వసూలు చేశారు.
- ఖాళీ స్థలాలకు సంబంధించి 525 ఎసెస్‌మెంట్లతో పాటు మొండి బకాయిలు కలిపి రూ.70 లక్షలకు గాను రూ.18 లక్షలు వసూలు చేశారు.
- కొళాయి పన్ను బకాయిలు రూ.3.71 కోట్లు కాగా రూ.25 లక్షలు , మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 40 షాపులకు సంబంధించి రూ.68.62 లక్షలకు గాను రూ.22.28 లక్షలు వచ్చింది.



సాలూరులో..

- సాలూరు మున్సిపాల్టీ పరిధిలో మొత్తంగా 2,641 అసెస్‌మెంట్లు ఉన్నాయి. ఆస్తి పన్ను బకాయిలు రూ.3,39 కోట్ల వరకు ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొత్తంగా రూ.4.48 కోట్లు వసూలు కావల్సి ఉండగా.. ఇప్పటివరకు రూ. కోటీ 9 లక్షలు మాత్రమే వసూలైంది.
- పట్టణంలో ఖాళీ స్థలాలు 804 వరకు ఉండగా.. వాటిల్లో ప్రైవేట్ వ్యక్తులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందినవి ఉన్నాయి. కొన్ని కోర్టు వివాదంలో ఉన్నాయి. పన్ను బకాయిలు రూ. 80 లక్షల వరకు ఉండగా రూ.7లక్షలే వసూలైంది.
- పోస్టాఫీసు నుంచి రూ. 26.77 లక్షలు, రైల్వే క్వార్టర్స్ రూ. 4 లక్షలు, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం నుంచి రూ.13,400, ఆప్టికల్ ఫైబర్ కోడ్ రిఫ్లక్టడ్ స్టేషన్ నుంచి రూ.3, 600, టెలికామ్ శాఖ నుంచి రూ.2,415 వరకు వసూలు చేయాల్సి ఉంది.
- తహసీల్దార్ కార్యాలయం నుంచి రూ.33 లక్షలు, ఎంపీడీవో కార్యాలయం రూ.26 లక్షలు, పీఆర్ డీఈఈ కార్యాలయం రూ.17 లక్షలు మేర రావాల్సి ఉంది. పెద్దగెడ్డ ఈఈ కార్యాలయం రూ. 17లక్షలు, తహసీల్దార్ నూతన భవన సముదాయం రూ.12 లక్షల వరకు రావల్సి ఉంది.
- ఎన్జీవో హోం , ప్రైవేట్ వ్యక్తుల నుంచి లక్షలాది రుపాయలను వసూలు చేయాల్సి ఉంది. 'సకాలంలో పన్నులు చెల్లించకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.' అని కమిషనర్ సీహెచ్ సత్యనారాయణ తెలిపారు.

విదర్భ విజయ దుందుభి

- పాండిచ్చేరిపై 7 వికెట్ల తేడాతో గెలుపు
- సయ్యద్ ముస్తాక్ అలీ టీ- 20

6లో



పంచగ్రామాల భూముల క్రమబద్ధీకరణకు అడుగులు

- సింహాచలం దేవస్థానం చైర్మన్ అశోక్‌ను కలిసిన విశాఖ ఎమ్మెల్యేలు

6లో

ఆదివాసీ సంస్కృతికి అద్దం.. థింసా

- ఆకట్టుకునే గిరిజనుల నృత్యం
- దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు

భామిని, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి)

థింసా... ఈ పేరు వింటే ఓ బృందం వలయాకారంలో లయబద్ధంగా నృత్యం చేస్తున్న దృశ్యం కళ్ల ముందు కదలాడుతుంది. గిరిజనులకే సొంతమైన ఈ నృత్యం ఎప్పటికీ వన్నె తరగనిది. దశాబ్దాల కిందట ఒడిశాలోని కొరాపుట్ జిల్లా నుంచి ఆరంభించిన ఈ నృత్యం ఇప్పటికీ అందరినీ ఆకట్టుకుంటోంది. ఏడుగురు పురుషులు, ఏడుగురు స్త్రీలు కలిసి డప్పు వాయిద్యానికి అనుగుణంగా వలయాకారంలో నృత్యం చేస్తుంటే...మనం కళ్లప్పగించి చూస్తూ ఉండిపోవాల్సిందే. మారుతున్న కాలానికి అనుగుణంగా నృత్యంలో అనేక మార్పులు వచ్చినా థింసాకు ఆదరణ చెక్కు చెదరలేదు. గతంలో గిరిజన ప్రాంతానికే ఇది పరిమితం కాగా... ఇప్పుడు పట్టణ వాసులు సైతం మక్కువ చూపుతుండడం విశేషం.



థింసా నృత్యం ఇలా..

ఎన్నో రకాలు...

గిరిజన గ్రామ దేవతలను పూజిస్తూ సామూహికంగా థింసా నృత్యం ప్రారంభమవుతుంది. చూడడానికి ఈ నృత్యం ఒకేలా ఉన్నప్పటికీ అనేక రకాలుగా అడుగులు వేయడం ప్రత్యేకత. రాళ్లను ఏరే నృత్యం... ఆకులను సేకరించే నృత్యం, పులి నాట్యం, సోదరీ సోదరుల జీవన విధానంతో నాట్యం, పక్షుల నృత్యం, కమ్మర చెక్క వ్యవసాయం..ఇలా వారి జీవన శైలికి అద్దం పడుతుంది.

మారని జీవితాలు..

సవర సంస్కృతిని కాపాడేందుకు ప్రయత్నించే ఆదివాసీ గిరిజన కళాకారుల జీవితాల్లో మాత్రం ఎటువంటి మార్పు లేదు. వ్యవసాయ కూలీలుగా పనులు చేస్తూ.. సంప్రదాయ థింసా నృత్యం గొప్పతనాన్ని చాటిచెప్పడమే లక్ష్యమని వారు చెబుతారు. ఈ కళాకారులను ఆర్థికంగా ఆదుకునే వారు లేరు. ప్రభుత్వం నుంచి కూడా సాయం అందడం లేదు. ప్రభుత్వ, ప్రైవేటు ఉత్సవాలలో మాత్రం వీరి నృత్యం ఉంటుంది. ఆ తరువాత వీరిని మరచిపోతుంటారు. ఆర్థిక సమస్యలను అధిగమించేందుకు ఈ కళాకారులు ఒక్కొక్కరుగా పొట్ట చేతపట్టుకొని వలసబాట పడుతున్నారు.



థింసా నృత్యం చేస్తున్న మనుమకొండ గిరిజనులు

[illegible]



పల్లెల్లో ఆదివాసీల సామూహిక నృత్యాలు కనుమరుగవుతున్నాయి. సవర సంస్కృతిని, కళను కాపాడుకోవడం కోసం ఒక బృందాన్ని ఏర్పాటు చేసి 2009లో థింసా నృత్య ఆదివాసీ సవర సంస్కృతి అనే పేరుతో సంఘాన్ని రిజిస్ట్రేషన్ చేశాను. 20 మంది బృందంతో కొనసాగిస్తున్నాను. ఈ బృందంతో 2010లో తృతీయ ఆదివాసీ యువ సంస్కృతి కార్యక్రమంలో గుజరాత్‌లో ప్రదర్శన ఇచ్చాం. ఐటీడీఏ తరఫున వివిధ కార్యక్రమాల్లో ప్రదర్శనలు ఇస్తున్నాం. తాజాగా రాయపూర్, చత్తీస్‌ఘడ్, జమ్మూకశ్మీర్‌లో ప్రదర్శనలు ఇచ్చాం.

-పత్రిక చెల్లయ్య, థింసా గురువు, మనుమకొండ

నృత్యాలు అంటే ఉత్సాహం..



చిన్నప్పటి నుంచి గ్రామంలో నృత్యాలు చేస్తుండడంతో చూసి ఆనందించే దానిని. ఇంటర్ చదివిన తర్వాత ఇంటి వద్ద ఖాళీగా ఉన్నాను. నృత్యాలలో భాగస్వామ్యం కావాలని కోరుకుంటు న్నాను. థింసా నృత్యానికి దేశ వ్యాప్తంగా ఆదరణ ఉండడం ఎంతో సంతోషం కలిగిస్తోంది.

-దిడ్లంగి సామి, మనుమకొండ

పంచగ్రామాల భూముల క్రమబద్ధీకరణకు అడుగులు

- సింహాచలం దేవస్థానం చైర్మన్ అశోక్‌ను కలిసిన విశాఖ ఎమ్మెల్యేలు



అశోక్‌తో విశాఖ ఎమ్మెల్యేలు

విజయనగరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సింహాచలం దేవస్థానం పరిధిలోని పంచ గ్రామాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారి ఆస్తుల క్రమబద్ధీకరణకు అడుగులు పడుతున్నాయి. బుధవారం సాయంత్రం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్, విశాఖకు చెందిన ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణ, విష్ణుకుమార్ రాజు, గణబాబు, రమేష్‌బాబు తదితరులు విజయనగరంలోని అశోక్ నివాసానికి చేరుకుని, పంచగ్రామాల భూముల విషయమై అశోక్ గజపతిరాజుతో చర్చించారు. సమావేశంలో జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతి రాజు పాల్గొన్నారు. చర్చల అనంతరం టిడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు సింహచలం దేవస్థానం పరిదిలో ఉన్న పంచగ్రామల భూముల విషయంపై ఆశోక్ గజపతిరాజుతో చర్చించామన్నారు. ఈ గ్రామాల పరిధిలో 420 ఎకరాల్లో పేదలు ఇంటినిర్మాణాలు చేసుకున్నారని తెలిపారు. ఈ భూముల విషయమై 2014లో తొలి క్యాబినెట్ మీటింగ్‌లో తీర్మానించారన్నారు. 420 ఎకరాలకు బదులుగా సింహచల దేవస్థానానికి ప్రభుత్వం 620 ఎకరాలు ఇస్తూ దానికి అయ్యే రిజిస్ట్రేషన్ ఖర్చులకు అయ్యే మొత్తాన్ని దేవస్థానం ఖాతాకు జమచేయనున్నట్లు తెలిపారు. దీంతో ఆయా గ్రామాల పరిధిలో ప్రజలకు ప్రభుత్వం ఎంతో మేలు చేసినట్లు అవుతుందన్నారు. దేవస్థానం చైర్మన్ ఆశోక్ గజపతిరాజు సానుకూలంగా స్పందించటంతో ఈ సమస్యపై స్పష్టత వచ్చిందని పల్లా శ్రీనివాస్ చెప్పారు.

సింహచలం దేవస్థానం చైర్మన్, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి ఆశోక్ గజపతిరాజు మాట్లాడుతూ ఈ సమస్య తమ హయాంలో పరిష్కారం అయితే సంతోషదాయకమన్నారు. అయితే భూములు బదలాయింపు.. గృహాల క్రమబద్ధీకరణ పారదర్శకంగా జరగాలన్నారు. అలాగే స్వామి వారి చందనోత్సావానికి అవసరమయ్యే గంధపు వనాలను పెంచాలని ఆయన కోరారు. గతప్రభుత్వ హయాంలో గోవులకు తిండి కూడా పెట్టని దౌర్భాగ్యపరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారాజు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ అకాడమీ పరిశీలన

విజయనగరం టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం సమీపం చింతల వలసలోని డాక్టర్ పీవీజీ రాజు నార్త్‌జోన్ క్రికెట్ అకాడమీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, మాజీ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సానా సతీష్‌లు బుధవారం పరిలీంచారు. సయ్యద్ ముస్తక్ అలీ టీ- 20 క్రికెట్ టోర్నీలో భాగంగా మైదానానికి విచ్చేసిన విదర్భ, పాండిచ్చేరి జట్ల క్రీడాకారులతో పాటు, అక్కడే శిక్షణ పొందుతున్న అండర్-16 రాష్ట్ర క్రికెట్ జట్టు క్రీడాకారులను పరిచయం చేసుకుని కాసేపు ముచ్చటించారు. అనంతరం స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రాంగణమంతా కలియతిరిగి సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అకాడమీ చైర్మన్ పి.వాసుదేవరాజు, కన్వీనర్ పి.దేవవర్మ, జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధి పి.సీతారామరాజు పాల్గొన్నారు.



అకాడమీలో సౌకర్యాలను పరిశీలిస్తున్న దృశ్యం

ఇంటి ముందే ఔషధాలు

- పెరటి మొక్కలు.. ఆరోగ్య నేస్తాలు
- ఆహ్లాదం.. ఆరోగ్యం వీటితో సొంతం

రాజాం రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పెరటిచెట్టు వైద్యానికి పనికిరాదనేది పెద్దల సామెత.. కానీ వాస్తవానికి మన ఇంటి పెరట్లో పెంచుతున్న మొక్కల్లో ఎన్నో ఔషధ గుణాలున్నాయన్న సంగతి చాలామందికి తెలియదు. అలవాటుగానో, తాత్కాలిక అవసరాల కోసమో మనం వివిధ మొక్కలను పెంచుతున్నాం. కానీ వాటి విలువ, ఆరోగ్యపరంగా వాటి ఉపయోగం చాలామందికి తెలియదనడంలో సందేహం లేదు. పెరటి మొక్కల్లో రోగాలను నయం చేసే శక్తి ఉందని ఆయుర్వేద వైద్యులు శ్రీనివాస్ స్పష్టం చేస్తున్నారు. ఏయే మొక్కలో ఏమేర ఔషధ గుణాలున్నాయో పరిశీలిద్దాం.









గోరింట: సాధారణంగా గోరింటాకును ఇష్టపడని మహిళలు ఉండరంటే అతిశయోక్తి కాదు. సౌందర్యానికి గోరింటాకు ఎంత ఉపయోగపడుతుందో.. ఆరోగ్య రీత్యా అంతే మేలు చేస్తుంది. లేత ఆకుల కషాయం పచ్చకామెర్లకు ఔషధంగా వాడవచ్చును. మెత్తగా నూరిన ముద్దను అరికాళ్లకు రాస్తే కాళ్ల మంటలు తగ్గుతాయి. కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. శిరోజాలకు ఈ ముద్ద రాసి కాసేపయ్యాక తలంటుకుంటే శిరోజాలు నిగ నిగలాడుతాయి. ఇది మూత్రకోశ వ్యాధుల నివారణకు ఎంతో ఉపయోగపడుతుంది.

కరివేపాకు: కూరలు, రసం, సాంబారు తదితర వంటకాలలో వాడుతారు. అతిసారాన్ని అరికట్టే గుణం లేత కరివేపాకుకు ఉంది. ఈ ఆకులతో తయారు చేసిన కషాయం వాంతులను నివారిస్తుంది. విషపురుగు కుట్టినపుడు దీని రసం పూస్తే ఉపశమనం కలుగుతుంది. ఈ ఆకును ముద్దగా నూరి చర్మ వ్యాధులకు రాస్తే తగ్గుతాయి.

తులసి: ప్రతి ఇంటి ఆవరణలోనూ తులసి మొక్క ఉండడం సహజం. అందరూ భక్తిభావంతో పూజించే ఈ మొక్క ఆకుల రసం తలనొప్పి, దగ్గును నివారిస్తుంది. దీని రసం ముక్కు దిబ్బడను తగ్గిస్తుంది. అల్లం, మిరియాలు పొడి చేసి.. ఈ రసంతో కలిపి తాగితే జ్వరం, మూత్ర సంబంధ వ్యాధులు తగ్గుతాయి.

వేప: చాలామంది పెరట్లో వేపమొక్క కనిపిస్తుంది. దీనిని చల్లని గాలి కోసం నాటుతారు. ఇది సర్వ రోగ నివారిణి. ఆకుల మూటికలు తింటే కడుపులోని వివిధ వ్యాధులు తగ్గుతాయి. ముద్దను నీటిలో కలిపి చిన్నపిల్లలకు పడితే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఈ చెట్టు నుంచి వెలువడిన గాలి ఎంతో సురక్షితం. ఆకుల ముద్ద శరీరానికి రాస్తే చర్మవ్యాధులు తగ్గుతాయి. గ్రామాలలో అమ్మవారు సోకితే వేపముద్ద ఒళ్లంతా రాయడం చూస్తుంటాం.

మందారం: చర్మ సౌందర్యానికి చక్కని సహాయకారి ఇది. తల వెంట్రుకలు పెరుగుదలకు, వాపులు తగ్గడానికి, చర్మం నునుపుగా ఉండడానికి ఆకులు ఉపయోగపడతాయి.

బొప్పాయి: ఈ మొక్క ఉత్పత్తులలో విటమిన్ ఎ ఎక్కువగా ఉంటుంది. బొప్పాయి ఆకుల్లో కార్పిన్ ఆల్కహాల్ ఉండడంతో అంటు వ్యాధులకు, రక్త విరేచనాలు తగ్గడానికి ఉపయోగపడుతుంది. బొప్పాయి కాయలను కూరగా చేయవచ్చును. పండ్లు తింటే జీర్ణకోశ వ్యాధుల నివారణకు ఎంతగానో ఉపయోగం. బొప్పాయి పిక్కలను ఎండబెట్టి పొడి చేసి తేనెలో కలుపుకుని తింటే కడుపులో నులి పురుగులు తగ్గుతాయి. ప్లేట్‌లెట్ల సంఖ్య గణనీయంగా తగ్గిన వారికి బొప్పాయి లేత ఆకుల రసం తాగిస్తే గంటల వ్యవధిలో ప్లేట్‌లెట్ల సంఖ్య లక్షల్లోకి చేరుతుంది.

కలబంద: దాదాపుగా గ్రామాల్లోని అన్ని ఇళ్ల పెరట్లో కలబంద చెట్టు ఇటీవల కనిపిస్తోంది. స్త్రీల వ్యాధులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. రెండు గ్రాముల కలబంద గుజ్జును బెల్లంతో కలిసి నెలసరికి ముందు వారం రోజుల పాటు రోజుకు రెండుసార్లు తింటే ఆ సమయంలో వచ్చే కడుపునొప్పి తగ్గుతుంది. ఈ గుజ్జును ముద్దచేసి తలకు రాసుకుంటే చుండ్రు తగ్గుతుంది. జుట్టు రాలడాన్ని అరికడుతుంది.



కరణ్ రనౌట్ ఇలా..

విదర్భ విజయ దుందుభి

- పాండిచ్చేరిపై 7 వికెట్ల తేడాతో గెలుపు
- సయ్యద్ ముస్తక్ అలీ టీ- 20

విజయనగరం టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బీసీసీఐ ఆధ్వర్యంలో డెంకాడ మండలం చింతలవలసలోని డాక్టర్ పీవీజీ రాజు స్పోర్ట్స్ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న సయ్యద్ ముస్తక్ అలీ టీ- 20 దేశవాళీ క్రికెట్ టోర్నీలో పాండిచ్చేరి జట్టుపై విదర్భ జట్టు విజయదుందుభి మోగించింది. విదర్భ- పాండిచ్చేరి జట్ల మధ్య బుధవారం జరిగిన మ్యాచ్‌లో విదర్భ జట్టు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన పాండిచ్చేరి 19.4 ఓవర్లలో 136 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఆ జట్టు బ్యాటర్లలో ఓపెనర్ కేబీ అరుణ్ కార్తీక్ (27 బంతుల్లో 30 పరుగులు), మిడిలార్డర్ బ్యాటర్లు అంకిత్‌శర్మ (36 బంతుల్లో 40), ఫాబిద్ హమీద్ (11 బంతుల్లో 17) రాణించారు. మిగతా బ్యాటర్లు విఫలమవ్వడంతో పాండిచ్చేరి జట్టు స్వల్ప స్కోర్‌కే పరిమితమైంది. విదర్భ జట్టు బౌలర్లలో డీజీ నల్కండే, పీఆర్ రేఖాదే మూడేసి వికెట్లు సాధించారు. అనంతరం 137 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన విదర్భ జట్టు ధాటిగా ఆడి 12.3 ఓవర్లలో కేవలం 3 వికెట్లు కోల్పోయి 139 పరుగులు చేసింది. విదర్భ ఓపెనింగ్ బ్యాటర్లు అధర్వ తైదే (35 బంతుల్లో 49 పరుగులు నాటౌట్), కరణ్ నాయర్ (32 బంతుల్లో 65 పరుగులు) తొలి వికెట్‌కు 10 ఓవర్లలో 102 పరుగులు చేసి జట్టు విజయానికి బాటలు వేశారు. ఫస్ట్ డౌన్‌లో వచ్చిన కెప్టెన్ జెఎం శర్మ 5 బంతుల్లో రెండు ఫోర్లు, రెండు సిక్సర్లతో 20 పరుగులు చేయడంతో విదర్భ సునాయాసంగా విజయాన్ని అందుకుంది. ఈ విజయంతో విదర్భ ఖాతాలో 4 పాయింట్లు చేరాయి.



విదర్భ బ్యాటింగ్



క్యాచ్ పడుతున్న పాండిచ్చేరి కీపర్



హాఫ్ సెంచరీతో అభివాదం చేస్తున్న విదర్భ బ్యాట్స్‌మేన్ కరణ్

న్యూస్ బాక్స్

29 నుంచి కోరాపుట్ ప్యాసింజర్ రైలు రద్దు

కొత్తవలస, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్టణం నుంచి కోరాపుట్ వరకు నడుస్తున్న ప్యాసింజర్ రైలును రైల్వేశాఖ అధికారులు రద్దు చేస్తున్నట్టు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోమటిపల్లి, రాయగడ, విజయనగరం మధ్య నాన్ ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా ఈ నెల 29 నుంచి డిసెంబరు 4 వరకు ఈ రైలును రద్దు చేస్తున్నట్టు తెలిపారు. ఈ రైలు కొత్తవలస, కంటకాపల్లి విజయనగరం మీదుగా నడుస్తోంది.

రుచికరమైన భోజనం అందించాలి

వంగర, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మంచి రుచికరమైన భోజనంతో పాటు ఆహారం కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని ఎంఈవో దుర్గారావు అన్నారు. బుధవారం మగ్గూరు, ఓని పాఠశాలలను ఆయన తనిఖీ చేవారు. విద్యాబోధన, మౌళిక సదుపాయాలతో పాటు మధ్యాహ్న భోజన నిర్వహణపై ఆరా తీశారు. విద్యార్థులకు రుచితో పాటు శుభ్రమైన వాతావరణంలో భోజనం అందించాలన్నారు.

బేవరేజ్ డిపోల వేలం పాట

నెల్లిమర్ల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీ బేవరేజ్ కార్పొరేషన్ లిమిటెడ్ డిపో వద్ద ఉన్న వస్తు సామగ్రి వేలం పాటను బుధవారం నిర్వహించారు. డిపో మేనేజర్ ఆర్.గౌరీశ్వరరావు, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.శ్రీనాథుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి

విజయనగరం దాసన్నపేట, నవంబరు 27: విశాఖ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా డిసెంబరు 27న విశాఖపట్టణంలో బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టనున్న మహాధర్నా కార్యక్రమానికి ఉత్తరాంధ్ర లోని బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సోము రాంబాబు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మహాధర్నాకి సంబంధించిన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు.

3న తరుణీ షాపింగ్ ఫెస్ట్-2024

విజయనగరం రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ అనుబంధ సంస్థ ఇన్నర్‌వీల్ క్లబ్ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా మహిళలకు వ్యాపార రంగంలో ఉపాధి అవకాశాలు తదితర వాటిపై అవగాహన కల్పించేందుకు తరుణీ ఫెస్ట్-2024 నిర్వహిస్తోంది. మహిళలను వ్యాపారవేత్తలుగా తయారు చేయడమే లక్ష్యంగా వచ్చే నెల 3న ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటలకు ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులో ఉన్న ఎస్‌వీఎన్ లేక్ ప్యాలస్‌లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఇన్నర్‌వీల్ క్లబ్ ప్రతినిధులు గ్రంధి శిరిషా, అనితా బోత్రా, కల్పనా కుక్రేజాలు చెప్పారు. బుధవారం క్లబ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు ఈ మేరకు మాట్లాడారు.

నేడు టీడీపీ విజయనగరం నియోజకవర్గ సమావేశం

విజయనగరం రూరల్, నవంబరు 27: టీడీపీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం గురువారం ఉదయం 10.30 గంటలకు పార్టీ కార్యాలయం (అశోక్ బంగ్లా)లో నిర్వహించనున్నట్టు టీడీపీ నియోజకవర్గ నాయకులు ప్రసాదుల ప్రసాద్, బొద్దల నర్సింగరావు, ఆల్తి బంగారుబాబు, గంటా పోలి నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ, డివిజన్ టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు హాజరౌతారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలో టీడీపీ సభ్యత్వ నమోదు ప్రక్రియ వేగవంతం చేసే విధంగా ప్రణాళిక సిద్ధం చేయడం ఈ విషయంలో చర్చించనున్నట్టు తెలిపారు.

కొత్తూరులో జటలమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

నెల్లిమర్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలుగోలు పంచాయతీ మధుర గ్రామం కొత్తూరులోని జటలమ్మ తల్లి అమ్మవారి ఆలయ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. కొత్తూరుతో పాటు అలుగోలు, పల్లిపేట, జోగిరాజుపేట, రాగోలు, తాటిపూడి గ్రామాలకు చెందిన భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, డీసీసీబీ మాజీ వైస్ ఛైర్మన్ చనమల్లు వెంకటరమణ, తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్



మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి

దత్తిరాజేరు, నవంబరు27(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే టీడీపీ ప్రభుత్వ ధ్యేయమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని పోరళి రైతు సేవా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామన్నారు. ప్రభుత్వ అధికారులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని, వారి సేవలను వినియోగించుకోవాలన్నారు. జిల్లాలో వెనుకబడిన మండలంగా దత్తిరాజేరు మండలం ఉందని, మండల అభివృద్ధికి తనవంతుగా అన్ని విధాలా కృషి చేస్తానన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు ధాన్యం విక్రయించి గిట్టుబాటు ధర పొందాలన్నారు. పార్టీలకు అతీతంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి సహకరించాలన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి మిత్తిరెడ్డి ఈశ్వరరావు, మాజీ ఎంపీపీ బెజవాడ రాజేశ్వరి, నాయకులు బోడసింగి సత్తిబాబు, పెద్దింటి మోహన్, క్లస్టర్ ఇన్‌చార్జిలు మజ్జి మహేష్, బెజవాడ బంగారు నాయుడు, తహసీల్దార్ పి.విజయభాస్కర్, ఏవో అనూరాధ, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

విజయనగరం కలెక్టరేట్/జామి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బుధవారం సాయంత్రం రాష్ట్ర ఎంఎస్ఎంఈ, ఎన్ఆర్ఐ, సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేశారు. జామి మండల అట్టాడ గ్రామానికి చెందిన పసుపురెడ్డి గణేష్, జయ దంపతులకు అంగవైకల్యంతో నవజాతి శిశువు జన్మించింది. ఆ బిడ్డకు విశాఖపట్టణంలోని కృష్ణ హాస్పిటల్‌లో చికిత్స అందిస్తున్నారు. వారి సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా శిశువుకు వైద్య ఖర్చుల కోసం రూ. 3,71,380 ఆర్థిక సాయం మంజూరైంది. అలాగే గంట్యాడ మండలం మదుపాడ గ్రామానికి చెందిన ఆదిరెడ్డి దిలీప్ కిడ్నీలో రాళ్ళ వ్యాధితో బాధపడుతూ విశాఖపట్టణంలోని కృష్ణ హాస్పటల్ చికిత్స పొందారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నిధికి దరఖాస్తు చేసుకోగా రూ.20 వేలు సీ ఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైంది. ఆయా చెక్కులను మంత్రి శ్రీనివాస్ చేతులు మీదుగా లబ్ధిదారులకు బుధవారం అందజేశారు.

భర్త వేధింపులు తట్టుకోలేక..

● వివాహిత ఆత్మహత్య



మధులక్ష్మి(ఫైల్)

భోగాపురం, నవంబరు27(ఆంధ్రజ్యోతి): భర్త వేధింపులు భరించలేక మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు అందించిన వివరాలు ప్రకారం లింగాలవలస గ్రామానికి చెందిన కాల్ల పైడమ్మ, సన్యాసప్పడుకు కనకల మధులక్ష్మి(30) ఒకే కుమార్తె. మధులక్ష్మికి మొదట ఒక వివాహమై భర్త చనిపోవడంతో తన కుమారుడు మహేష్‌బాబుతో కలిసి తల్లిదండ్రుల వద్దే ఉండేది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన కనకల రామారావుతో పరిచయం ఏర్పడి, ఇద్దరూ ఇష్టపడడంతో 2019 నవంబరులో వివాహమైంది. వీరికి 4 సంవత్సరాల కుమార్తె కీర్తి ఉంది. అయితే వివాహమైన ఏడాది నుంచి భార్యభర్తల మధ్య గొడవలు మొదలయ్యాయి. భార్యను అనుమానించడం, పుట్టింటి నుంచి డబ్బులు తేవాలని వేధించే వాడు. మద్యానికి బానిసై తాపీ పనికి కూడా వెళ్లడం మానేయడంతో కుటుంబ భారమంతా మధులక్ష్మిపై పడింది. భర్త వేధింపులు తాళలేక తరచూ మధులక్ష్మి గ్రామంలోగల పుట్టింటికి వెళ్లిపోయేది. రెండు రోజులు క్రితం భార్యభర్తల మధ్య గొడవ జరగడంతో పెరగడంతో మధులక్ష్మి పుట్టింటికి వెళ్లిపోయింది. అనంతరం మంగళవారం రాత్రి రామారావు అత్తవారింటికి వెళ్లి భార్యను తనతో తీసుకెళ్లిపోయాడు. అక్కడ మళ్లీ వివాదం జరగడంతో మధులక్ష్మి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గుర్తించి భర్త కిందకి దించి స్థానికుల సహకారంతో సపర్యలు చేయగా అప్పటికే మధులక్ష్మి మృతి చెందింది. దీనిపై మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వి.పాపారావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేశామని, మృతురాలి భర్త రామారావుని అదుపులోకి తీసుకున్నామన్నారు. పోస్టుమార్టు అనంతరం పూర్తి విషయాలు తెలుస్తాయని ఎస్ఐ పాపారావు తెలిపారు. కాగా అల్లుడే తన కూమార్తెను చంపేశాడని మృతురాలి తల్లి కాల్ల పైడమ్మ వాపోయింది. తల్లి మృతి చెందడం, తండ్రిని పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో చిన్నారులు మహేష్‌బాబు, కీర్తి అనాథలయ్యారు.

నూతన విద్యా విధానంతో విద్యార్థులకు నష్టం

● ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ



భారీ ర్యాలీగా వెళ్తున్న ఏఐఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

విజయనగరం దాసన్నపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ విద్యా విధానంతో లక్షలాది మంది విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దినేష్ శ్రీ రంగరాజు అన్నారు. బుధవారం ఏఐఎస్ఎఫ్ఐ 49వ రాష్ట్ర మహాసభలు ఘనంగా జరిగింది. భారీ ర్యాలీతో నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రంగరాజు మాట్లాడుతూ, విద్యార్థుల మెదడులోకి మతోన్మాదాన్ని నింపి విద్యార్థుల మధ్య మత ఘర్షణలు పెంచి పోషిస్తున్న ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. దీనిని అడ్డుకోవాలంటే కేవలం శాస్త్రీయ విద్యా విధానం వల్లే జరుగుతుందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రభుత్వ రంగసంస్థలను అమ్మేస్తుందని, పేదల ఆకలి తీర్చకుండా అంబానీ, అదానీల ఆస్తులను పెంచడానికి పనిచేస్తుందన్నారు. ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న మాట్లాడుతూ, అధికారంలోకి రాక ముందు ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన నరేంద్రమోదీ మూడోసారి ప్రధానమంత్రి అయినా నిరుద్యోగులకు లక్ష ఉద్యోగాలు కేటాయించకుండా మోసం చేశారన్నారు. రాష్ట్ర, కేంద్రప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభల్లో నూతన పోరాట పంథాను ఏర్పాటు చేసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు కామేశ్వరరావు, బుగత అశోక్, గుజ్జల ఈశ్వరయ్య, ఎన్ బాబు, సుబ్బారావు, శివారెడ్డి, ఫణీంద్రకుమార్, షేక్ మస్తాన్, నాగభూషణ్‌తో పాటు ప్రజా నాట్యమండలి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు పరిశీలన



జరజాపుపేటలో టీడీపీ సభ్యత్వ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న బంగార్రాజు

పూసపాటిరేగ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలో అల్లాడపాలెం గ్రామంలో బుధవారం మార్క్‌ఫెడ్ ఛైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతం చేసే దిశగా పార్టీ కార్యకర్తలు కృషిచేయాలని, గ్రామాల్లో పెద్ద ఎత్తున పార్టీ సభ్యత్వాలు నిర్వహించాలని ఆయన తెలిపారు.

నెల్లిమర్ల, నవంబరు27(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదులో జిల్లాలో నెల్లిమర్ల నియోజకవర్గాన్ని ముందంజలో ఉంచాలని ఏపీ మార్క్‌ఫెడ్ ఛైర్మన్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. ఆయన బుధవారం నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట 19వ వార్డులో పర్యటించారు. సభ్యత్వ నమోదు ప్రక్రియను పరిశీలించారు. సభ్యత్వ నమోదును శతశాతం పూర్తిచేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అవనాపు సత్యనారాయణ, కాళ్ల సత్యవతి, కాళ్ల రాజశేఖర్, మద్దిల సూరిబాబు, మద్దిల శ్రీను, నల్లి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఇథనాల్ తయారీలో భద్రతా ప్రమాణాలు పాటించాలి

● ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బాబ్జీరావు



సంకిలి డిస్టిలరీ ప్లాంట్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న డీసీ

రేగిడి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సంకిలి ఈఐడీ ప్యారీ డిస్టిలరీ యునిట్‌లో తయారవుతున్న ఇథనాల్ నిల్వలు, వాటి నిర్వహణ, రవాణాలో అధిక జాగ్రత్తలు పాటించాలని, అవకతవకలు ఉంటే సహించేది లేదని జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్(డీసీ) ఎస్‌వీవీఎన్ బాబ్జీరావు సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. మండలంలో సంకిలి ఈఐడీ ప్యారీ షుగర్స్ అనుబంధ డిస్టలరీ ప్లాంట్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ప్లాంట్‌లో ఇథనాల్ తయారీ నిల్వలు, రికార్డులు, వాటి భద్రతపై ప్లాంట్ ఉద్యోగులను ప్రశ్నించారు. ముందుగా గొడౌన్‌లో నిల్వలు, నిర్వహణ, ల్యాబ్‌లో పనితీరును ఆరా తీశారు. రాజాం ఎక్సైజ్ సీఐ జైభీం, సిబ్బంది ఉన్నారు.

రాజాం: జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్ బాబ్జీరావు రాజాం నియోజకవర్గం పరిధిలోని రాజాం రేగిడి మండలాల్లో బుధవారం తనిఖీలు నిర్వహించారు. అనంతరం రాజాం ప్రొహిబిషన్ ఎక్సైజ్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. రాజాం పట్టణంలో కొన్ని బ్రాందీ షాపులను తనిఖీ చేశారు. మద్యం దుకాణాల్లో ఎటువంటి అక్రమాలకు తావివ్వకూడదని, నిబంధనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. మద్యం కల్తీ చేస్తే చర్యలు తప్పవన్నారు. రాజాం సీఐ జైభీం తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలతో సమాజ మార్పు



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సమాజ మార్పు, అభివృద్ధికి పుస్తక రచనలు తోడ్పడాలని రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ప్రొఫెసర్ విశ్వేశ్వరావు చనుమల్లు రచించిన రెండు ఆంగ్ల గ్రంథాలను బుధవారం నగరంలోని మంత్రి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమకాలీన విషయాలపై జనజాగృతి కలిగేటట్టు రచనలు ఉండాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ వైస్‌ఛైర్మన్ చనుమల్లు వెంకటరమణ రచయితలు ఎస్.దేవిక రాణి, రోహిణి, సునస ప్రియదర్శిని, రాష్ట్ర బాలల హక్కుల ఛైర్మన్ కేసలి అప్పారావు, బోద రామకృష్ణారావు, కె.సత్యానారాయణ, హరగోపాల్, మధు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

రైతు కోసమే ధాన్యం కొనుగోళ్లు



దేవుదళ ఆర్‌బీకేలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం దృశ్యం

రేగిడి, నవంబరు 27, (ఆంధ్రజ్యోతి): రైతుకు మద్దతు ఇచ్చేందుకే ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలు ఏర్పాటుచేసినట్టు తహసీల్దార్ చిన్నారావు, ఏఓ మురళీకృష్ణ తెలిపారు. మండలంలో రేగిడి పీఏసీఎస్ ఆధ్వర్యంలో దేవుదళ ఆర్‌బీకేలో బుధవారం ధాన్యం కొనుగోళ్ల కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రారంభసమావేశంలో తహసీల్దార్, ఎఓ తదితర్లు మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లతో రైతుకు ఈప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీనేతలు దూబ ధర్మారావు, కెంబూరు కోటేశ్వరరావు, ఏర్నేన రామినాయడు, కర్నేన మహేశ్వరరావు, రేగిడి పిఏసిఎస్ సిఇఓ గోవిందరావు సీఎస్‌డీటీ రామారావు తదితర్లు పాల్గొన్నారు

అయ్యప్పస్వాముల బస్సుకు ప్రమాదం

● అన్నమయ్య జిల్లాలో ఘటన ● గాయపడిన విజయనగరం భక్తులు

విజయనగరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): విజయనగరానికి చెందిన అయ్యప్ప భక్తులు ప్రయాణిస్తున్న బస్సు ప్రమాదానికి గురైంది. సోమవారాం జిల్లా కేంద్రంనుంచి బస్సు బయలు దేరింది. మంగళవారం తెల్లవారు జామున అన్నమయ్య జిల్లా, సంబేపల్లి మండలం వద్దకు చేరుకోగానే , ఎదురుగా వస్తున్న ఓ లారీ బస్సును బలంగా ఢీ కొట్టింది. దీంతో బస్సులోని అయ్యప్ప భక్తులకు తీవ్రగాయాలయ్యాయి. బస్సులో సుమారు 40 మంది వరకు ప్రయాణిస్తుండగా కొంతమందికి దంతాలు విరిగిపోయి, మరి కొందరికి ముఖం, కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో బస్సు నెమ్మదిగా ప్రయాణిస్తుండటంతో ప్రమాద తీవ్రత తగ్గిందని స్వాములు చెబుతున్నారు. ప్రమాద ఘటనలో నగరానికి చెందిన సత్యారావు, మహేష్, రామారావు, శ్రీధర్, ధనుంజయ, సత్యానారాయణకు గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో గాయపడిన వారిని కడప రిమ్స్‌కు తరలించారని స్థానికులు తెలిపారు. చిన్నపాటి గాయాలైన స్వాములు ప్రాథమిక చికిత్స తీసుకుని మరో బస్సులో శబరిమలైకు బయలు దేరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

రామభద్రపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రామభద్రపురం బైపాస్ రోడ్డు వద్ద మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. స్థానిక గొల్లవీధికి చెందిన శనగల మురళి (31) బొబ్బిలిలోని ఓ మెస్‌లో సప్లై బాయ్‌గా విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై రామభద్రపురం వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో మురళి అక్కడికక్కడే మృతిచెందాడు. మురళికి భార్య జ్యోతితోపాటు ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. మరికొద్ది సమయంలోనే ఇంటికి చేరుతాడన్న తరుణంలో మురళి మృతిచెందడంపై ఆయన కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. ఈ ప్రమాదానికి కారణమైన వాహనాన్ని వెతకడానికి ఎస్ఐ వెలమల ప్రసాద్ రెండు బృందాలను ఏర్పాటు చేశారు. బుధవారం బాడంగి సీహెచ్‌సీలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి పోలీసులు కేసు నమోదు చేశారు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

విజయనగరం క్రైం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో చోరీలకు పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసినట్టు వన్‌టౌన్ ఇన్‌చార్జి సీఐ అప్పలనాయుడు తెలిపారు. నగరంలో జూలై 15న అంబికా స్వీట్ షాపులో గుర్తు తెలియని దొంగ ప్రవేశించి రూ.50 వేలు చోరీ చేశారు. అలాగే ఈ నెల 25న గ్రీన్‌పార్కు, బార్ అండ్ రెస్టారెంట్‌లో గుర్తు తెలియని వ్యక్తి ప్రవేశించి క్యాష్ కౌంటర్ నుంచి రూ.12 వేలు దొంగిలించినట్టు ఫిర్యాదులు అందాయన్నారు. ఈ రెండు ఘటనలపై కేసు నమోదు చేసి దర్యాప్తుని వేగవంతం చేశారు. సీసీ ఫుటేజీ ఆధారంగా ఈ నేరాలతో సంబంధం ఉన్నట్టుగా గుర్తించి తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం గాదరాడ గ్రామానికి చెందిన దేవన బుజ్జియ్యను అరెస్టు చేశామన్నారు. నిందితుల వద్ద నుంచి గ్రీన్‌పార్కు బార్ అండ్ రెస్టారెంట్‌లకు సంబంధించి 12 వేల రూపాయలు, అంబికా స్వీట్ షాపులో చోరీ చేసిన 27,100 నగదు, సుత్తి, టార్చ్‌లైట్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ హరిబాబు నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి జైలు

పూసపాటిరేగ, నవంబరు27(ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో నిందితుడైన మండలంలో గుంపాం గ్రామానికి చెందిన లెంక శ్రీనివాసరావుకు ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి 7సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, 2వేల రూపాయల జరిమాన విధించినట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఒక ప్రకటనలో తెలిపారు. 2022వ సంవత్సరంలో 9 సంవత్సరాల బాలికను కొత్తగా నిర్మిస్తున్న భవనంమీదకి తీసుకువెళ్లి అత్యాచారయత్నం చేయటంతో నాటి మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ కె.టి.ఆర్ లక్ష్మి కేసు నమోదు చేశారు. దీనిపై విచారణ జరిపిన అనంతరం న్యాయస్థానం నిందితునికి ఈ శిక్ష విధించినట్లు తెలిపారు.

అనుమతిలేని లేఔట్‌కు నోటీసులు

రేగిడి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలో గుళ్లపాడు పంచాయతీ రెవెన్యూలో ఉంగరాడమెట్ట వద్ద దాదాపు 2.60 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన అనుమతి లేని లేఔట్‌ను శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా) గుర్తించింది. ఈ మేరకు పంచాయతీకి సుడా అభ్యంతరం తెలుపుతూ నోటీస్ జారీ చేసింది. వారం రోజుల్లోగా ఈ అక్రమ లేఔట్‌దారులకు నోటీస్‌లివ్వాలని ఆదేశించటంతో పంచాయతీ కార్యదర్శి ఆశాజ్యోతి బుధవారం నిర్వాహకులకు నోటీస్ జారీచేసినట్లు తెలిపారు. భూహక్కుదారుడి పేరును సైట్ నిర్వాహకులు గోప్యంగా ఉంచుతున్నారని, దీనిపై తహసీల్దార్‌కు రాతపూర్వక ఫిర్యాదు ఇస్తామని పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

ఏఎన్ఎంకు తీవ్ర గాయాలు

రామభద్రపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొట్టక్కి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏఎన్ఎంకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక పీహెచ్‌సీలో ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న యజ్జల నీరజారాణి భర్త మోహనరావుతో కలిసి ద్విచక్రవాహనంపై కొట్టక్కిలో జరుగుతున్న వైద్యశిబిరానికి వెళ్తుండగా వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొనడంతో ఆమెకు తీవ్ర, భర్త మోహనరావుకు స్వల్పగాయాలయ్యాయి. సాలూరు ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం నీరజారాణిని విజయనగరం తరలించారు. ఎస్ఐ వెలమలప్రసాద్ కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

బలిజిపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ వై.సింహాచలం తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. మండలంలోని వెంగాపురానికి చెందిన ఇటుకల వ్యాపారి కె.రవి గ్రామంలో వ్యాపారం నిమిత్తం అప్పులు చేశాడు. ఆ అప్పులు చెల్లించలేక మనస్థాపంతో సోమవారం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం విజయనగరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

ఇద్దరిపై కేసు నమోదు

శృంగవరపుకోట నవంబరు27(ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో నకిలీ పత్రాలతో కోర్టును మోసం చేసిన ఇద్దరిపై శృంగవరపుకోట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీస్‌ల వివరాల ప్రకారం.. గంజాయి కేసులో బెయిల్ కోసం గుంటూరుకు చెందిన గుంటి బాజీబాబు, మంజు హనుమంతం నకిలీ పత్రాలు సృష్టించారు. వీటిని శృంగవరపుకోట కోర్టుకు సమర్పించారు. ఇవి నకిలీ పత్రాలుగా గుర్తించిన కోర్టు సూపరింటెండెంట్ ఉపేంద్రకుమార్ స్థానిక పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్.ఐ గంగరాజు పోర్జరీ కేసు నమోదు చేశారు.

జాతీయ కరాటే పోటీల్లో కొత్తవలస విద్యార్థుల ప్రతిభ



కొత్తవలస, నవంబరు27ఆంధ్రజ్యోతి): అనంతపురంలోని అశోకనగర్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 24, 25 తేదీల్లో జరిగిన 68వ జాతీయ కరాటే పోటీలో కొత్తవలసకు చెందిన ఇద్దరు విద్యార్థులు విజేతలుగా నిలిచారని కోచ్ కె.సూర్య సూకరాజు తెలిపారు. కొత్తవలస నుంచి అండర్-14, అండర్-17 విభాగాల్లో పాల్గొనేందుకు వెళ్లారన్నారు. కొత్తవలసకు చెందిన మూనూరు అభిషేక్ అండర్-17 విభాగంలో విజేతగా నిలవగా, అండర్-14 విభాగంలో కె.జయశ్రీ ద్వితీయ స్థానం సాధించి వెండి పతకాన్ని పొందారన్నారు. వీరు ఇరువురు కొత్తవలసలోని వివిధ విద్యా సంస్థల్లో ఇంటర్మీడియట్, 10వ తరగతి చదువుతున్నారని తెలిపారు. వీరు త్వరలో డిల్లీలో జరిగే పోటీలకు హాజరవుతారన్నారు.

రాష్ట్ర స్థాయిలో తూడెం విద్యార్థులు

భోగాపురం, నవంబరు27(ఆంధ్రజ్యోతి): మండలం తూడెం హైస్కూల్‌కు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు 68వ రాష్ట్ర స్థాయి అండర్ 14 విభాగం సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానంలో బహుమతులు గెలుపొందారని పాఠశాల ఇన్‌చార్జి ప్రధాన ఉపాధ్యాయులు రమణబాబు తెలిపారు. అండర్ 14 రాష్ట్రస్థాయి పోటీలు ఈనెల 22 నుంచి 24 వరకు చిత్తూరు జిల్లా అరగొండలో నిర్వహించారని తెలిపారు. విద్యార్థులను అభినందించినట్లు తెలిపారు.

వరి కోతలు వాయిదా వేసుకోండి

రాజాం: అల్పపీడన ప్రభావం కారణంగా వరి కోతలు వాయిదా వేసుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీ చంద్రరావు, ఏఓ రేణుకాసాయి రైతులకు సూచించారు. పొగిరి గ్రామంలో రైతులు నూర్పులు చేసి దాన్యం బస్తాలకు పట్టి ఉంచినట్లు బుధవారం పరిశీలించారు. వాతావరణం అనుకూలంగా లేని కారణంగా వరికోతలు వాయిదా వేసుకోవడం మంచిదన్నారు.

బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరం

రాజాం రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేసినా, ప్రోత్స హించినా నేరమని జూనియర్ సివిల్ జడ్జి కృష్ణ సాయితేజ స్పష్టం చేశారు. బాల్య వివాహాలు లేని భారత్(బాల్ వివాహ్ ముక్త్ భారత్) ప్రచార కార్యక్రమంలో భాగంగా మండల న్యాయ సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రత్యేక న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు.

గుర్ల: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని గరివిడి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఆరుద్ర అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బాల్య వివాహాలపై ర్యాలీ నిర్వహించారు. ఆడపిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని తహసీల్దార్ ఆదిలక్ష్మి అన్నారు.

జామి: మండలంలోని కుమారాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం బాల్య వివాహాల వ్యతిరేక ప్రతిజ్ఞ నిర్వహించారు.

విజయనగరం దాసన్నపేట: జిల్లాను 2030 నాటికి బాల్య వివాహాలు లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లాలో ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి ఆధ్వర్యంలో నగరంలోని కంటోన్మెంట్‌లోని మున్సిపల్ హై స్కూల్‌లో వెబ్‌కాస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

డెంకాడ: స్థానిక మండల ప్రజా పరిషత్, కార్యాలయంలో బుధవారం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు వివిధ పంచాయతీల కార్యదర్శులు, మండల ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది, గవర్నమెంట్ జూనియర్ కళాశాల విద్యార్థులు హాజరై ప్రతిజ్ఞ చేశారు.

చీపురుపల్లి: లింగ వివక్షకు వ్యతిరేకంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం ప్రతిజ్ఞ చేశారు. లింగ వివక్ష లేకుండా అందరూ కృషి చేయాలని ఈ సందర్భంగా ఎంపీడీవో సరళ పిలుపునిచ్చారు.

రేగిడి: బాల్యవివాహాలను విద్యార్థులు వ్యతిరేఖించాలని, దీనిపై తల్లిదండ్రుల్లో చైతన్యం నింపాలని ఐసిడిఎస్ సుపర్‌వైజర్లు జి జానకీ, జి సూజత పేర్కొన్నారు. మండలంలో దేవుదళ కెజిబివి పాఠశాలలో బుధవారం బాల్యవివాహాల నియంత్రణపై రాజాం ఐసిడిఎస్ సిబ్బంది విద్యార్థులతో ర్యాలీ, చైతన్య సదస్సు నిర్వహించారు.

వంగర: బాల్య వివాహలు నేరమని, అడ్డుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీడీవో త్రినాథ, ఈవోపీఆర్డీ రామారావు అన్నారు. బుదవారం బాల్య వివాహలు దానివలన కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు మండల కార్యాలంతో పాటు అన్నీ పాఠశాల్లో ఎర్పాటు చేశారు.

గంట్యాడ మండలంలోని వివిధ గ్రామాల్లో వెలుగు ఆధ్వరంలో జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా బుధవారం రాత్రి మహిళా సంఘాల సభ్యులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలోని మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రాజాం: బాల్య వివాహాలు చట్టరీత్య నేరమని బాల్య వివాహాలు చేసి పిల్లల జీవితాలను పాడుచేయవద్దని ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు.

కొత్తవలస: వివాహాలను 21 సంవత్సరాల తరువాత చేసుకుంటే శారీరక, మానసిక, మేధోవికాసం కలుగుతుందని కొత్తవలస జూనియర్ సివిల్ న్యాయాధికారి సముద్రాల విజయచందర్ అన్నారు. బుధవారం కొత్తవలస జడ్పీ హైస్కూల్‌లో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన న్యాయాధికారి మాట్లాడుతూ అవగాహన కలిగించారు.

శృంగవరపుకోట: శృంగవరపుకోట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం స్థానిక న్యాయాధికారి సబ్బవరపు వాణి న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్యవివాహాలకు దూరంగా ఉండాలని విద్యార్థినులకు సూచించారు. మధ్యాహ్న భోజన వివరాలను ఆరా తీసారు. రికార్డులను చూసారు. నాణ్యమైన భోజనం పెట్టాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. న్యాయవాదులు డి.సత్యనారాయణ, గేదల ప్రకాశరావు తదితరులున్నారు.

పార్వతీపురంలో 'ఉయ్యాల జంపాల'

పార్వతీపురం టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాంతి స్వరూప సన్నిధానంలో మండల దీక్షల్లో భాగంగా అయ్యప్ప స్వామి ఉయ్యాల జంపాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామున అయ్యప్ప మేలుకొలుపు పురస్కరించుకుని సన్నిధాన నారాయణ గురుస్వామి ఆధ్వర్యంలో మండల దీక్షాపరులుగా ఉన్న కన్నె, కత్తె, గంట, గదా, విల్లు, పెరూ స్వాములు స్వామివారి ఉయ్యాల జంపాల కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. అనంతరం నగర సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు: సీఐ

పార్వతీపురంటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రధాన రహదారిలో షాపులు, తోపుడు బళ్లు, చిరువ్యాపారులునిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని పట్టణ సీఐ మురళీధర్ హెచ్చరించారు.బుధవారం పట్టణప్రధాన రహదారిపై ఆక్రమణలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతబస్టాండ్, నాలుగురోడ్లు, మేదరవీధి, సౌందర్య థియేటర్, ఆర్టీసీ కాంప్లెక్స్ కూడళ్ల వద్ద ప్రధాన రహదారికి ఇరువైపులా తోపుడుబళ్లు, షాపులు వల్ల వాహనాలరాకపోకలకుఅంతరాయం కలుగుతుండడంతో సంబంధిత వ్యాపారులకు హెచ్చరించామని, ట్రాఫిక్ సమస్యలు వస్తే ఊరుకోనేది లేదని తెలిపారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

పాలకొండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి):పూర్తికాని గృహాలు వేగవంతం చేసేలా లబ్ధిదారులకు సూచించాలని నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు సిబ్బందికి ఆదేశించారు. బుధవారం పట్టణంలోని గృహ నిర్మాణాలపై హౌసింగ్ సిబ్బంది, ఎమినిటీ సెక్రటరీలతో సమీక్షించారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

వీరఘట్టం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు విద్యార్థులకు అగ్ని ప్రమాదాల సమయంలో నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక కేం ద్ర సిబ్బంది, హెచ్‌ఎం సొంబర, ఉపాధ్యాయులు సుధీర్, ఉమా, శివకుమార్, లక్ష్మణ్, నాయుడు, కుసుమకుమారి, విజయరాణి పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల వల్ల అనర్థాలపై..

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సంకల్పం కార్యక్రమంలో భాగంగా బుధవారం సీఐ నిహార్ మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాలలో ప్రత్యేక ఫిర్యాదుల బాక్సును ఏర్పాటు చేశామని, విద్యార్థులు చేసిన ఫిర్యాదును ప్రతిరోజూ వచ్చి పరిశీలిస్తామని తెలిపారు.

పాలకొండలో 'బాల వివాహముక్త్ భారత్'



పాలకొండ: బాల వివాహముక్త్ భారత్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పాలకొండలోని పెద్దకాపువీధి ఉన్నత పాఠశాలలో బాల వివాహ ముక్త్ భారత్ కార్య క్రమం బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దుప్పాడ పాపినాయుడు, సోషల్ వర్కర్ తోట ప్రవీణ్‌కుమార్,మహిళా పోలీస్ దుర్గాంబ, పాఠశాల హెచ్‌ఎం బి.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

● సాలూరు రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు రహిత ఆంధ్రాగానిలబెట్టడానికి ప్రతిఒక్కరూ సహకరించాలని ఎంపీడీవో రమాదేవి పిలుపునిచ్చారు. సాలూరులో బాల్య వివాహాలు రహిత ఏపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయం, ఐసీడీఎస్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలోవైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, సీడీపీవో విజయలక్ష్మి,సూపర్‌వైజర్లు లక్ష్మి, అనురాధ పాల్గొన్నారు.

●మక్కువ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మక్కువ మండల పరిషత్ కార్యాలయంఆవరణలో బాల్యవివాహ రహిత ఆంధ్రప్రదేశ్‌పై బాలికలకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మండల పరిషత్, ఉపాధి హామీ, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

18 ఏళ్లు నిండిన వారిని ఓటర్లుగా చేర్పించాలి

పాలకొండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా చేర్పించాలని తహసీల్దార్ పి.బాలమురళీకృష్ణ కోరారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ఆయనతో పాటు డీటీ సన్యాసిరావు ఉన్నారు.

అగ్నిప్రమాద నష్టంపై జేడీకి నివేదిక

భామిని, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూర్జిగూడలో జరిగిన అగ్ని ప్రమాదం వల్ల జరిగిన నష్టంపై వ్యవసాయశాఖ జేడీకి నివేదిక అందజేస్తామని ఏడీఏ రత్నకుమారి తెలిపారు. నూరుస్తుండగా జరిగిన అగ్నిప్రమాదంలో పాలక కొజ్జా, బిడ్డిక మంగాడు, ఆరిక అప్పారావుకు చెందిన ధాన్యంతోపాటు ట్రాక్టర్ కాలిపోవడంతో సుమారు మూడు లక్షలు ఆస్తినష్టం జరిగిందని పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం సంఘటనా స్థలాన్ని వ్యవసాయ, రెవెన్యూ అధికారులు పరిశీలించారు.ఆమెతో పాటు తహసీల్దార్ ఎన్.అప్పారావు, అగ్రికల్చర్ సైంటిస్ట్ లక్ష్మీనారాయణ, వీఆర్వో కరుణాకర్, వీఏఏ ఎ ర్రన్న ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి

సీతంపేటరూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్ఐ వై.అమ్మన్నరావు తెలిపారు. బుధవారం స్థానిక డిగ్రీ కళాశాలలో సైబర్‌నేరాలు,సోషల్‌మీడియా తదితర అంశాలపై ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుశాంత్ జనా మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాల వైపు దృష్టి సారించవొద్దని కోరారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

గరుగుబిల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతులు ఫెంగల్ తుపాన్‌పై అప్రమత్తంగా ఉండాలని ఏవో ఆర్.విజయభారతి సూచించారు. బుధవారం మండలంలోని 13 రైతుసేవా కేంద్రాల్లోని సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె తోటపల్లి తదితర గ్రామాల్లో పర్యటించారు. తుఫాన్ వల్ల రైతులు వరి కోతలను నిలిపివేయాలని కోరారు.

● సీతంపేట రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి):అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో పి.శ్రీదేవి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికి వరికోతలు చేయని రైతులు వాయిదా వేసుకోవాలని సూచించారు. కోతలు జరిగి, పొలంలో వరి పనలు ఉంటే కుప్పలు పెట్టుకొని టార్పాలిన్లతో కప్పి జాగ్రత్త చేసుకోవాలని పేర్కొన్నారు.

●సాలూరురూరల్, నవంబరు27 (ఆంధ్రజ్యోతి):పంట చేతికి వచ్చే సమయంలో తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలోవర్షాలు కురిస్తే పంటకు నష్టం వాటిల్లే అవకాశముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు కురిసే అవకాశముండడంతో రైతులు జాగ్రత్తలు పాటించాలని సాలూరు ఏవో అనురాంధ పండ కోరారు.

విభిన్న ప్రతిభావంతుల ఉపకరణాల గుర్తింపు శిబిరం

పాలకొండ,నవంబరు 27 (ఆంధ్రజ్యోతి):స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో విభిన్నప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ అలింకోసంస్థ సౌజన్యంతో ఆశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కవిత ఆధ్వర్యంలో సహాయ ఉపకరణాల గుర్తింపు శిబిరం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ బొమ్మాళి భాను, సుధాకరరావు, మండల అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి):గిరిజన గురుకుల పాఠశాల, కళాశాలలో 15 సంవత్సరలుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఉద్యోగభద్రత కల్పించాలనిగిరిజనవిద్యార్థి సంఘం,గిరిజన అభ్యుదయసంఘం గౌరవాధ్యక్షుడు దోని సురేష్, పల్ల సురేష్, ఆరిక చంద్రశేఖర్ కోరారు. బుధవారం గుమ్మలక్ష్మీపురంలో విలేకరులతో మాట్లాడుతూ పీఆర్సీ ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు.

జీసీటీఏ అధ్యక్షుడిగా రాజు

పాలకొండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి):పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పార్వతీపురం మన్యం జిలా ప్రభుత్వ కళాశాలల ఉపాధ్యాయుల అసోసియేషన్ కార్యవర్గ (జీసీటీఏ) ఎన్నికలు రిటర్నింగ్అధికారి, జోన్-1 జీసీటీఏ ప్రెసిడెంట్ డాక్టర్ పైడితల్లి, ఎన్నికల అబ్జర్వర్ డాక్టర్ ఢిల్లేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగాయి. వివిధ కళాశాలల అధ్యాపకులు అధ్యక్షుడిగా బి.రాజు, జనరల్ సెక్రటరీగా జి.శ్రీనివాసరావు, మహిళాసెక్రటరీగా బి.మంజుల, ట్రెజరర్‌గా తేజేశ్వరరావును ఎన్నుకున్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్యాంబాబు ఎన్నికైన కార్యవర్గాన్ని అభినందించారు.



కంబరవలసలో పిల్లర్ల దశలో పనులు నిలిచిపోయిన దృశ్యం

పర్యవేక్షణ లేక.. పనులు పూర్తికాక

● ఇదీ వీరఘట్టం మండలంలో చెత్త సంపద కేంద్రాల దుస్థితి

వీరఘట్టం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెత్త సంపద కేంద్రాల పనులపై పర్యవేక్షణ లేకపోవడంతో నేటికీ పూర్తికాలేదు. దీంతో పంచాయతీలు అదనపు ఆదాయం సమకూర్చాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.

ఇదీ పరిస్థితి

మండలంలోని 34 పంచాయతీలకు గాను 16 చెత్త నుంచి సంపద కేంద్రాలు మాత్రమే పూర్తయ్యాయి. చిదిమిలి, చిట్టిపుడివలస, కంబరవలస, వండువ, పీపీఆర్‌పురం, ఎం.రాజపురం కేంద్రాలు పనులు వివిధ దశల్లో ఉన్నాయి. మరో 12కేంద్రాలు పనులు ప్రారంభంకాలేదు. గతంలో టీడీపీ ప్రభుత్వం పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరే విధంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రతి పంచాయతీలో కేంద్రంఏర్పాటుచేసి వాటిలో పొడి చెత్త, తడిచెత్త వేరుచేసి కంపోస్టు ఎరువులను తయారుచేసేలా ప్రణాళికలు రూపొందించారు. దీన్ని రైతులకు విక్రయించిఅదనంగా ఆదాయం సమకూర్చి పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించాలని టీడీపీ ప్రభుత్వం ఆశయం అటకెక్కుతోంది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం చెత్త నుంచి సంపద కేంద్రాలు నిర్వహణపై ఆసక్తి చూపకపోవడంతో గతంలో టీడీపీ హయాంలో చేపట్టిన నిర్మాణాలు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చెత్త సంపద కేంద్రాలను పూర్తిస్థాయి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు పనులు వేగవంతం చేశారు. కాగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిర్మాణాలు పూర్తయిన చోట్ల కంపోస్టు ఎరువులు తయారు చేయనున్నట్లు ఎంపీడీవో బి.వెంకటరమణ తెలిపారు. నిర్మాణాలు పూర్తికాని కేంద్రాలు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

48 గంటల్లో రైతు ఖాతాలోకి డబ్బులు: విప్



కొమరాడ: రైతుకు ట్రక్‌షీట్ అందజేస్తున్న జగదీశ్వరి

కొమరాడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ధాన్యం విక్రయించిన 48 గంటల్లోగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేయనున్నట్లు ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. బుధవారం మండలంలోని గుణానుపురం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి, ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు ట్రక్ షీట్లు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

గరుగుబిల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు సంబంధించి మిల్లర్లు నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని తహసీల్దార్ పి.బాల హెచ్చరించారు. బుధవారం పెద్దూరులోని రైస్ మిల్లులు, రైతుసేవా కేంద్రాలు, కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఆమె వెంట ఆర్ఐ శ్రీనివాస్ గౌరీప్రసాద్, కార్యదర్శి బి.అప్పారావు, జూనియర్ సహాయకులు గులిపల్లి రవితేజ ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నాగూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ ఎ.మధుసూదనరావు ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ అరకు బీసీ సేల్ అధికార పార్టీ ప్రతినిధి ద్వారపురెడ్డి సత్యనారాయణ, సిబ్బంది జోత్స్న పాల్గొన్నారు.

● సాలూరు రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మామిడిపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ ఎన్వీరమణ,ఏవో అనురాధపండ, టీడీపీ మండలాధ్యక్షుడు ఆముదాల పరమేశు డొంక అన్నపూర్ణ ప్రారంభించారు.కార్యక్రమంలో బూసతవుడు, చిన్నబాబు,భరత్ శ్రీనివాసరావు, శ్రీనివాసరావు,సీఈవో యజ్ఞేశ్వరరావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలి: జేసీ



సీతానగరం:మాట్లాడుతున్న శోభిక

సీతానగరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని జేసీ ఎస్ఎస్ శోభిక కోరారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ధాన్యంకొనుగోళ్లపై రైస్ మిల్లర్లు, జిల్లా పౌర సరఫరాలశాఖ, వ్యవసాయశాఖ సిబ్బంది, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్‌తో సమీక్షించారు. అనం తరం గుచ్చిమిలో రైతుసేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీచేశారు. సమావేశంలో ఎంపీపీ ప్రతినిధి బి.శ్రీరాములునాయుడు, టీడీపీ మండలాధ్యక్షులు పి.సత్యంనాయుడు, తహసీల్దార్ ఉమామహేశ్వరరావు, రైస్ మిల్లర్లు, జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్, పౌర సరఫరాల సంస్థ మేనేజర్ పి.శ్రీనివాసరావు, ఏవో అవినాష్, సీఎస్‌డీటీ రమేష్‌బాబు పాల్గొన్నారు.

● బలిజిపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు దగ్గర నుంచి రైతు ఖాతాలో డబ్బులు జమయ్యేవరకు ఏ అధికారైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని జేసీ శోభిక హెచ్చరించారు. బలిజిపేటలో మిల్లర్లు, క్లస్టర్, మండలస్థాయి అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో జేడీ శ్రీనివాసరావు, డీఎం రాబర్ట్‌పాల్, తహసీల్దార్ రత్నకుమారి పాల్గొన్నారు.

● వీరఘట్టం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): త్వరగా ధాన్యం కొనుగోలు చేయాలని సబ్‌కలెక్టర్ యశ్వంత్ కుమార్‌రెడ్డి కోరారు. బుధవారం మండలంలోని తూడిలో రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించి, ధాన్యం కొనుగోలు వివరాలు తెలుసుకున్నారు. తుఫాన్‌హెచ్చరికల నేపథ్యంలో రైతులనుంచి ధాన్యాన్ని సేకరించాలని సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, ఏవో సౌజన్య లక్ష్మణనాయుడు పాల్గొన్నారు.

ధాన్యం మిల్లులకు తరలించాలి

తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతుల ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా మిల్లులకు తరలించాలని ఏవో సౌజన్య తెలిపారు. బుధవారం మండలంలోని అడారు, బిటివాడ గ్రామాల్లోని పంట పొలాల్లో రైతులతో మాట్లాడారు. వర్షాలు పడితే కోతలు నిలిపివేయాలని కోరారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

● మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసులునాయుడు



ఉద్యోగులకు సంఘీభావం తెలియజేస్తున్న శ్రీనివాసులునాయుడు

సీతంపేట రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి):గిరిజన గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు కోరారు. సీతంపేటలోని ఐటీడీఏ కార్యాలయ ప్రధాన గేటు వద్ద ఎనిమిది రోజులుగా ఉద్యోగులు చేస్తున్న నిరాహార దీక్ష శిబిరాన్ని బుధవారం ఆయనతోపాటు ఏపీటీఎఫ్ జిల్లా పూర్వ అధ్యక్షుడు దుర్గారావు, పాలకొండ మండలఅధ్యక్షప్రధాన కార్యదర్శులు వాసు,సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణదొర సందర్శించి సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ మన్యం జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు మహేష్, నల్ల బాలకృష్ణ మాట్లాడుతూ గిరిజన సంక్షేమ ఆశ్రమ, గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులను గిరిజనవిద్యాశాఖలోకి విలీనం చేసి,వారి సర్వీసును క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కార్య క్రమంలో ఏజేఏసీ నాయకులు బి. శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, రామ్మోహనరావు, ఉద్యోగులు బి గణేష్,మోహనరావు పాల్గొన్నారు.

స్వచ్ఛ సుందర పార్వతీపురంలో భాగస్వాములు కావాలి



పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న మునిసిపల్ సిబ్బంది

పార్వతీపురంటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సుందర పార్వతీపురంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మునిసిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరీ కోరారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన స్వచ్ఛ సుందర పార్వతీపురం కార్యక్రమంలో మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు, వాకర్స్ క్లబ్‌లు, యువజన సంఘాల సభ్యులు స్వచ్ఛ సుందర పార్వతీపురం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు, శానటరీ ఇన్‌స్పెక్టర్ పకీరు రాజు పాల్గొన్నారు.

చింతలబెలగాంలో పంట కోత ప్రయోగం

జియ్యమ్మవలస,నవంబరు27(ఆంధ్రజ్యోతి): పంటకోత ప్రయోగాలతో దిగుబడులను నిర్ధారించవచ్చని రైతు సాధికార సంస్థ ప్రతినిధి వి.గోపి అన్నారు. బుధవారం మండలంలోని చింతలబెలగాంలో రైతులు యోగిరెడ్డి కృష్ణ, పెద్దింటి కృష్ణల వరి క్షేత్రాల్లో పంట కోత ప్రయోగం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ, యూనిట్ ఇన్‌చార్జి బి.ధనుంజయరావు, రైతులు కృష్ణ, తేజ, సింహాచలం, పాల్గొన్నారు.

జేజేఎం పనులు పూర్తి చేయాలి

సీతంపేట రూరల్, నవంబరు27(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో జలజీవన్ మిషన్ (జేజేఎం)కింద ఇంటింటికి కొళాయిల ద్వారా నీరు సరఫరా చేసేందుకు రూ.100 కోట్లతో చేపట్టిన పనులుపూర్తిచేయాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ఎం.లక్ష్మణరావు, బి.అప్పారావు, జె.శ్రీరాములు కోరారు. బుధవారం సీతంపేటలో విలేకరులతో మాట్లాడుతూపనులు ప్రారంభించి నాలుగేళ్లు గడుస్తున్నా 25 శాతం మాత్రమే పూర్తయ్యాయని తెలిపారు. నియోజకవర్గంలో 75 గ్రామాల్లో నివసిస్తున్న గిరిజనులు గ్రావిటేషన్ ఫ్లో నీరుతాగి రోగాల బారినపడుతున్నారని ఆందోళనవ్యక్తంచేశారు.పనులు పూర్తి చేయకపోతే పాలకొండలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు.

గిరిజన రైతులకు చేప పిల్లల పంపిణీ

సీతంపేట రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి):మండలంలో చింతాడ, మోహన్‌కాలనీ, తుంబన్నకాలనీ, చిన్నబగ్గ, నాగులగూడ, బొండి తదితర గ్రామాల్లోని 36 మంది గిరిజన రైతులకు 43,400 చేపపిల్లలను సర్పంచ్ నీలయ్య, పీహెచ్‌వో వెంకట గణేష్ పంపిణీచేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు శ్రీ భారతీరాజ్, సర్పంచ్ ఆనప, గ్రామ ఫిషరీస్ అసిస్టెంట్ నిమ్మక విజేత, ఆదినారాయణ పాల్గొన్నారు.

● పాలకొండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మత్స్యకార రైతులకు చేప పిల్లలను సీడ్ స్టాకింగ్ స్పెషల్ ఆఫీసర్ మంగవేణి, పాలకొండ డివిజన్ మత్స్యశాఖ అధికారి డబ్బీరు గోపీకృష్ణ పంపిణీ చేశారు. లుంబూరులో పెద్దచెరువు, నవగాంలో వీరసాగరం, భద్రసాగరం, అట్టలిలోని కోనేరులో పనుకువానిచెరువు, టిడిపారాపురంలో పెద్దచెరువుల్లో చేప పిల్లలను విడిచిపెట్టారు.

నూతన పద్ధతులతో అధిక లాభాలు

గరుగుబిల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ విధానంలో నూతన పద్ధతులను అవలంబిస్తే అధిక లాభాలు సాధించవచ్చని జిల్లా ప్రకృతి వ్యవసాయ మేనేజర్ పి.షణ్ముఖరాజు తెలిపారు. బుధవారం తోటపల్లి జట్టు కార్యాలయం ప్రాంగణంలో వ్యవసాయ కార్యకర్తల శిక్షణను పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ ఏలు వై.తిరుపతి, వై.ముసలయ్య, జి.అన్నపూర్ణ, సీహెచ్ శారద, దేవీప్రసాద్ పాల్గొన్నారు.



ఘన జీవామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న షణ్ముఖరాజు

వంద రోజుల పని కల్పించండి

వీరఘట్టం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికి వంద రోజుల పని కల్పించాలని ఎంపీడీవో బి.వెంకటరమణ తెలిపారు. బుధవారం స్థానిక మహిళాసమాఖ్య సమావేశమందిరంలో క్షేత్రసహాయకులు, సాంకేతిక సిబ్బందితో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్లె పండుగ పనులను పూర్తి చేయడం, 2025-26 ఆర్థిక సంవత్సరానికి గుర్తించి పనులకు అంచనాలు తయారు చేయడంపై చర్చించారు. కార్యక్రమంలో ఏపీవో జి.సత్యం నాయుడు,ఈసీ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

ప్రతిభతో ముందుకు సాగాలి



కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ పారుల్

రాయగడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జయాపజయాలు సర్వసాధారణమని, ప్రతి ఒక్కరూ ప్రతిభతో ముందుకు సాగినప్పుడే విజయం సొంతమవుతుందని కలెక్టర్ పారుల్‌పట్వారి తెలిపారు.రాయగడలోని బారిజోల ఏకలవ్య పాఠశాలలో సరిగిపుల్లో 2024 శిశుఉత్సవం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలన్నారు. అనంతరం 11సమితులకు చెందిన విద్యార్థులకు, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, రన్నింగ్‌రేస్, వక్తృత్వ వ్యాసరచన తదితర 14 పోటీలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ సంతోష్ పాత్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జడ్పీ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, డీఈవో బసంతకుమార్ నాయక్, శిశుసంక్షేమాధికారి భరత్‌భూషణ్ బిస్వాల్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌సరఫరాకు అంతరాయం

మక్కువ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మావుడి సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ ఫీడర్‌లో ఆర్‌డీఎస్ఎస్ పనుల నిమిత్తం గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు శంబర గ్రామానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఈఈ కె.గోపాలరావునాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ మేరకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు సాగునీటి సంఘం ఎన్నికలపై శిక్షణ

గరుగుబిల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల అభివృద్ధి కార్యాలయంలో సాగునీటి ఎన్నికల నిర్వహణపై గురువారం శిక్షణ నిర్వహించనున్నట్లు నీటి పారుదలశాఖ అధికారి ఎ.ప్రవీణ్‌సాగర్ తెలిపారు. బుధవారం గరుగుబిల్లిలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఎన్నిక నిర్వహణపై నిబంధనలను ఈవో, పీవో, ఏఈవోలకు వివరించనున్నట్లు చెప్పారు.

39 మంది రక్తదానం

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన శిబిరంలో 39 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎల్విన్‌పేట సీఐ హరి మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. కార్య క్రమంలో ఎస్ఐ శివప్రసాద్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వరం పాల్గొన్నారు.

రోగులకు రక్తపరీక్షలు తప్పనిసరి

పాలకొండ,నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మలేరియా, డెం గ్యూ రోగులకు రక్తపరీక్షలు తప్పనిసరి అని జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ తెలిపారు. బుధవారం పట్ట ణంలోని ఏరియాఆసుపత్రిలోరక్తపరీక్షల ల్యాబ్‌ను పరిశీలించారు. మలేరియా, డెంగ్యూ పరీ క్షల కిట్లను తెప్పించుకోవాలని ల్యాబ్ టెక్నీషియన్ సుబ్రహ్మణ్యానికి సూచించారు.